
# సినీ బేతాళ కథలు





## – డా. కె.వివేకానందమూర్తి

*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

### - 10 -

### గోపికాచిత్తరంజన్

**విక్రమార్కుడు** మళ్ళీ బేతాళుడి శవాన్ని బేతాళుడి భుజం మీద వేసుకోడం కుదరక తన భుజం మీద వేసుకుని మళ్ళీ నడక సాగించాడు.

'విక్రమార్కా! నీకు శ్రమ కలగకుండా ఉండేందుకు మరో కథ చెపుతాను విను' అని బేతాళుడు కథ చెప్పడం మొదలు పెట్టాడు -

'అనగనగా, అన్నా అనకపోయినా మూడు నిర్మాతలుండేవి. వారి వారి దాహస్థాయికి తగినట్టుగా వారిని ఇండస్ట్రీ అంతా - జ్యోతి, జీవనజ్యోతి, అఖండ జ్యోతి అని పిలిచేవారు.

జ్యోతి అప్పుడో పెగ్గు అప్పుడో పెగ్గు వేసుకుని వెలిగేవాడు.

జీవనజ్యోతి ప్రతిరోజూ కాసిని పెగ్గులు వేసుకుని వెలిగేవాడు.

అఖండజ్యోతి నిత్యాగ్నిహోత్రంలా నిరంతరం పెగ్గులు బిగిస్తూ పగలూ రాత్రీ తేడా తెలియకుండా భగభగా వెలుగుతూనే ఉండేవాడు.

ఈ వివరణ నా సొంతంకాదు. ఇలా జ్యోతిర్మయులైన పెగ్గు భూషణుల గురించి, పద్మభూషణుడైన శ్రీ యస్పీ బాలుగారు ఉదహరించారు. అంచేత ఆ గానగంధర్వుడికి ముందుగా కృతజ్ఞతలు చెప్పి, కథ ముందుకి తూల్తాను, సారీ కథ ముందుకి తోల్తాను.

నిర్మాతలు ముగ్గురూ ఉగ్గుపాల నాటినుంచీ పెగ్గుపాలు పెంచుకుంటూ నిషాల దేశంలో నిగ్గుతేలారు.

జ్యోతి, జీవనజ్యోతి, అఖండజ్యోతి ఎన్ని పెగ్గులతో వెలుగుతున్నా విగ్గులూడిపోతాయేమోనని హీరోలెవరూ అభ్యంతరంగా తలలు అడ్డంగా ఊపేవారుకాదు. అదీగాక ఈ నిర్మాత జ్యోతులు మూడూ, తమ ఆరని జ్యోతీ ఫిలింస్ బ్యానర్ మీద చాల విజయవంతమైన సినిమాలు తీశారు.

ఇంతకీ అసలు కథ హీరోగారి గురించి. ఆరనిజ్యోతీ ఫిలింస్ చిత్రాలన్నింటిలోనూ అతడే హీరో. ఆ హీరో పేరు గోపికాచిత్తరంజన్. వీడియో ఆవిష్కరణలకీ, విడుదలయాక సంబరాలకీ థాంక్సు లిస్టులా గోపికాచిత్తరంజన్ పేరు పొడుగ్గా ఉందని హీరోని గో.చి. బాబుగా వాడసాగారు. గోచిబాబు ఏ చిత్రంలోనూ విగ్గుపెట్టుకోడు. తనకి తొలిచిత్రం, వేషం వస్తే తలనీలాలు సమర్పించుకుంటానని శ్రీ తిరుపతి వెంకన్నకు మొక్కుకున్నాడు. అనుకున్నట్టే గోపికాచిత్తరంజన్‌కి, అదే మన గోచి బాబుకి ఫస్ట్ బ్రేక్ వచ్చింది. వెంటనే జైశ్రీమన్నారాయణ! అని ఆనంద బాష్పాపుష్పాలతో ఇష్టదైవాన్ని ఆరాధించి వెంటనే తిరుమలకు వెళ్ళి నున్నగా గుండు చేయించేసుకున్నాడు. అప్పట్నించీ యూల్ బ్రిన్నర్‌లా, టెల్లీ సవాలస్‌లా, గోచిబాబు ప్రఖ్యాత గుండు హీరో అయిపోయాడు. అన్ని రకాల ప్రేక్షకుల గుండెల్లో గోచిబాబు గుండు పండుగ చేసేసింది.

పిల్లలు గోచిబాబు గుండులాంటి బంతి కావాలని పేచీ పెట్టేవారు. అబ్బాయిలంతా గుండు ఫాషన్‌లోకి దిగిపోయారు. బజార్లన్నీ గుళ్ళతో బంతుల సముద్రాలయ్యాయి. రకరకాల సైజుల్లో గుండులు నిండిన ఊళ్ళన్నీ వలయగ్రహాలు సందడి చేసిన నభోమండలంలా మారిపోయాయి. కాబోయే పెళ్ళికొడుకులకి గుండులేకపోతే సంబంధాలు తప్పిపోసాగాయి.

నిర్మాతలంతా దర్శకుల్ని 'గోచిని పెట్టండి. గోచిని పెట్టండి' అని వత్తిడి చెయ్యసాగారు. 'మేం గోచి పెట్టుకునే వచ్చాం' అని దర్శకులు చెప్పినా, 'నిర్మాతలు - మేం సెప్పేది ఆ గోసి కాదు. ఆ గోసి అయిటం సాంగ్ పిల్లలకి. మేం సెప్పేది గోపికాసిత్తరంజన్. గోసిబాబు - అదే గోచిబాబు గురింసి. గోచిబాబు లేకపోతే బొమ్మాడదు.' అని పట్టుపట్టసాగారు.

షూటింగ్ మధ్యలో తేడా వచ్చి ఏ దర్శకుడైనా నిర్మాతతో 'గోచీని తీసేద్దాం సార్' అంటే నిర్మాత ఉగ్రుడైపోయి - 'గోసీని తీసేస్తే, నిన్ను గోసీతో నిడమ్రు తోలేత్తా, ఎదవయేసాలైకు' అని వార్నింగిచ్చేవాడు.

జ్యోతి, జీవనజ్యోతి, అఖండజ్యోతి తూలుకుంటూ - 'మేం మనిసి తూలినా, మాట తూలం. గోచిబాబూ మా సిరిమావే సెయ్యి. నువ్వేటంటే అదే ఫిక్సు. మాతోటే నిండిపో' అని గోచిబాబు గుండు మీద తలాక్షరాలు రాసేసారు. అంతేకాదు, గోచిబాబుకి ఒక మంచి బిరుదు తగిలిస్తే బాగుంటుందని డిసైడై పోయారు.

'మనోడికి విస్కీ విఖ్ఖాత నట సామ్రాజసక్కవర్తి అని తగిలించేద్దారి' అని సూచించాడు అఖండజ్యోతి.

'ఇస్కీ ఇక్కాత కాదురా తాగుబోతు పీనుగా! విశ్వవిక్యూత అనుండాల. మనోడికి విశ్వవిక్యూత నట సేరేష్ట - అని కార్డేద్దాం' - అన్నాడు జీవనజ్యోతి.

'విశ్వవిఖ్యాత ఓల్డ్ స్టయిలు. అదీగాక మనసుకవి ఆత్రేయగారు 'విశ్వం' అంటే ఆంధ్రప్రదేశం అని కూడా అర్థం ఉందని ఎప్పుడో సెప్పారు. ఆనాటి నటులెవ్వరూ ఆంధ్రా దాటి పెద్దగా తెలియరు. మరి ఆల్లంతా విశ్వ బిరుదులున్నారే. అంచేత మన గోచిబాబుకి కొత్త స్టయిల్లో బిరుదెడదాం.' అన్నాడు జ్యోతి.

'అంటే ఏటి ఉరుద్దేశం?' అడిగాడు అఖండజ్యోతి.

'ఏటుంటది? ఇంగిలీసోడి టచ్చిచ్చి ఏ సూపరో డూపరో ఎడదావని ఆడి అవిడియా!' - అన్నాడు జీవనజ్యోతి.

'కరెస్టు. మనోడికి హైస్పీడ్ లెజెండ్' అని బిరుదెడితే అదురుద్ది.

'సూపరే సూపరు. మరయితే అలాక్కానియ్' అన్నాడు అఖండజ్యోతి గుక్కేసుకుంటూ గుక్కతిరక్కుండా.

'అయితే సబోటెట్టి సన్మానవెట్టి, ఏ మంతిరిగాన్నో, ఏసాల్లేని ఓ ముసిలేక్టరుగాన్నో, పిలిసి అడావుడిసేసి బిదురు తగిలింసేద్దాం' అని సెకండ్ చేశాడు జీవనజ్యోతి.

'సబా సట్టు బండలు యేవక్కర్లా. మనకే బిరుదు టైటిల్ కార్డు మీదేసి మూజిక్కోణ్ణి బాగా సౌండెట్టి బీటుకొట్టవంటాం.!' అన్నాడు జ్యోతి.

'మ్రీ నాకో వ్రీ - పేచ్చుకులేవంటారో! ' - అఖండజ్యోతి.

'ఆల్లేవ్రను. అలా అనే వోల్లు సినిమాలకెక్కడెల్తారు. ఆల్లకి టయివేదీ - అంచాత మన గోచిబాబుకి అయిస్పేడు లెజెండ్ ఫిక్సు.' అని ఫైనలైజ్ చేశాడు జ్యోతి.

మళ్ళీ ఆరనిజ్యోతి ఫిలింస్ చిత్రం - 'నీ గుండు నా గుండూ రెండు ఒకటే' రిలీజైంది. టైటిల్స్‌లో 'హై స్పీడ్ లెజెండ్ గోచిబాబు' అని కనబడగానే అశేషప్రేక్షకులు ఈలల్తో గోలల్తో తనువు మరిచి ఆహ్వాన సంక్షోభంతో కుర్చీల్లో నిలబడి కేరింతల్తో నృత్యాలు చేశారు.

అసలే బిజీగా ఉన్న గోచిబాబు ఆ రోజు నుంచీ ఇంకా బిజీ అయిపోయాడు. అతని షూటింగ్స్ విరామం లేకుండా కొనసాగసాగాయి. అయితే ప్రతిరోజూ షూటింగ్ మధ్యలో 'లంచ్ చేసొస్తా' అని ఒక రెండు మూడుగంటలు అదృశ్యమయిపోయేవాడు.

ఒకరోజు నిర్మాతలు మూడు జ్యోతులూ హీరోతో అన్నారు - 'గోచిబాబు. నీకోసం పెసలు పుడ్డు తెప్పిత్తాం - ఇక్కడే తినై!' అని.

'నాకు పెసలు పడవు. పెసలు తింటే జుట్టు వెంట వెంటనే పెరిగి గుండు మాసిపోయి నా గ్లామర్ దెబ్బ తింటుంది' అన్నాడు గోచిబాబు.

'పెసలంటే పెసలుకావు. యి స్పెసలు' - అఖండజ్యోతి.

'అయినా అది సమస్యకాదు. నాకు మా ఆవిడంటే ప్రాణం. ఆమె చేతివంట తినకపోతే నొచ్చుకుంటుంది. ఆమె నొచ్చుకుంటే నా యాక్షన్ వీక్కైపోతుంది. గుండు మాసిపోతే మంగలి సాయంతో నా కొత్త గుండు మెరుస్తుంది. కానీ నా భార్య బాధపడితే ఆమె మనసులో వెంట్రుకల్లా మొలిచిన వేదనలను గీకడానికి ఏ మంగలిని పిలుస్తావ్ అఖండ జ్యోతీ!? ఆ మంగలిని ఏ కత్తితో గీకమంటావ్ జీవనజ్యోతీ!? నువ్వైనా అర్థం చేసుకో జ్యోతీ - నా భార్య పెట్టే ప్రేమ లంచ్ లేని నా జీవితం ఫెయిల్యూర్. ఆ ఎఫెక్ట్‌కి నీ చిత్రం కూడా డబుల్ ఫెయిల్యూర్. -' అని తన గుండుకి చెమట పట్టేదాకా ఆవేశంగా ఆన్సరిచ్చాడు గోచిబాబు.

'నువెల్లా సెబితే అలాగే - సిత్రం మాత్రం ఫెయిలనకు. అప్పుసెట్టయి ఆపకుండా తాగేసి సిరివోసి సొచ్చి సచ్చిపోతాం. నిరుమాత హత్తాపాతకం నీ ఒల్లంతా హీరోయిన్లా సుట్టుకుపోద్ది. అలాక్కానీ బాబూ - అల్లాగే కానీ - యెల్లు - మీ సీవతికాడకెల్లి బోంసేసి దబ్బునా! ' - అని నిర్మాతలు ముగ్గురూ ఎడ్జస్టయిపోయారు. కాలం పరుగెడుతోంది. రేపు, అర్జంటుగా ఇవాళైపోతోంది. గుండులాంటి భూగోళం గుండ్రంగా తిరిగేస్తోంది.

ఒకరోజు ప్రతిరోజులాగే తన భార్య దగ్గరకు వెళ్ళి లంచ్ చేసి షూటింగ్‌కి వచ్చిన హైస్పీడ్ లెజెండ్ గోచిబాబు తన మూడు నిర్మాత జ్యోతులకీ విచిత్రంగా కనిపించాడు. అతని ముఖం ఏదో నొప్పితో బాధపడుతున్నట్టుంది. అశేషప్రేక్షకాదరణకు అలవాటైన గోచిబాబు గుండు నున్నగాలేదు. గుంటలు పడిన ఇత్తడి చెంబులా అయిపోయింది. నాసా వారు, కొత్తగా కనుగొన్న, క్రేటర్స్‌తో ఉన్న గ్రహతలంలా కూడా అయిపోయింది. విపరీతంగా సొట్టలు పడిన గుండుతో గోచిబాబు గ్రహాంతరవాసిలా కనిపిస్తున్నాడు.

కట్ చేస్తే - గోచిబాబు గతుకుల గుండుతో ఒక సైకిల్ రిక్షా పక్కన నిలబడి కనిపించాడు. ముందుగా చూసి షూటింగ్‌లో సీన్లో ఉన్నాడనుకున్నారు - కానీ షూటింగ్ కాదని తర్వాత తెలిసింది అక్కడ రోడ్డుమీద జనాలకు. ఆ ఢిల్లీ జనంలో గోచిబాబు నిజమైన అభిమాని గోచిబాబు దగ్గరకు వెళ్ళి అడిగాడు - 'మీరు గోచిబాబు అంటే గోపికాచిత్తరంజన్‌గారుకదూ!'

'అవునుబాబూ! నేనే - తవరు?'

'హీరోగా శిఖరాల్ని దాటిన మీ అభిమానిని. ఇలా రిక్షాదగ్గర నిలబడ్డారేం?'

'ఈ రిక్షా నాదే బాబూ! బేరాల్లేక నిలబడి బేరం కోసం చూస్తున్నాను బాబూ!'

'బలేవారే! ముందు మీరు రిక్షాలో కూర్చోండి' - అని ఆ అభిమాని గోచిబాబుని బలవంతంగా రిక్షాలో కూర్చోబెట్టి, రిక్షా తను తొక్కుతూ అన్నాడు. - 'గోచిబాబుగారూ! నేను మీ నిజమైన అభిమానిని. మీరు నిన్న స్టార్ అయి ఈరోజు ఉల్క అయినా చెదిరి మారిపోని అచంచలమైన అభిమానిని. ఈరోజు మిమ్మల్ని ఇలా రిక్షాలో కూర్చోబెట్టుకుని తొక్కుతుంటే మీరెక్కిన ఏనుగులా ఫీలవుతున్నాను. మీరేవనుకోకపోతే - నాకో చిన్న సందేహం - అడగొచ్చా?'

'తప్పకుండా అడుగుబాబూ!' - గోచిబాబు.

'మేవంతా ప్రేమించే మీ గుండు గుంటలతో ఎందుకిలా షేపు మారిపోయింది? మీడియా ఎప్పుడూ, మీకు మీ భార్య అంటే గొప్ప ప్రేమ, గౌరవం అని చెప్పేవారు. ఆమెగారు కులాసాగా ఉన్నారా?'

'ఉన్నారు బాబూ - కానీ నా దగ్గరలేరు. ఇక నా గుండు సంగతంటావా? విను -' అంటూ గోచిబాబు విషయం చెప్పగానే, అతని వీరాభిమాని వెంఠనే రిక్షా ఆపి, దిగి - హైస్పీడ్ లెజెండ్ గోపికా చిత్తరంజన్ అనే గోచిబాబుని రోడ్డు మధ్య వదిలేసి విరోచనాలు పట్టుకున్నవాడిలా అర్జంటుగా పరుగెట్టి ఢిల్లీ జనంలో కలిసిపోయాడు.

- ఇప్పుడు చెప్పు విక్రమార్కా! గోచిబాబు తన వీరాభిమానికి ఏవని బదులిచ్చాడు. విన్నాక వీరాభిమాని ఎందుకలా పారిపోయాడు? అసలు గోచిబాబు ఇచ్చిన రిప్లై ఏవిటి?' - ఈ ప్రశ్నకు నువ్వు తెలిసే సమాధానం చెప్పక పోయావో, నీ తల గోచిబాబు గుండులా గోతుల గుండైపోతుంది!' అని బేతాళుడు ముగించాడు.

అప్పుడు విక్రమార్కుడు ఇలా సమాధానం చెప్పాడు.

'ఓ బేతాళా! గోచిబాబు, తన వీరాభిమానికి ఇచ్చిన సమాధానం ఇది.

- నా భార్య ఇల్లు సరిదిద్ది నాకు చక్కగా వంట చేసిపెడుతుంది.

- నా భార్య ఎప్పుడూ నాతో ఆహ్లాదకరంగా మాట్లాడుతుంది.

- నా భార్య ఎంతో నమ్మకస్తురాలు. అబద్ధం చెప్పదు.

- నా భార్యకు ఎప్పుడూ నాతోనే ఉండడం ఇష్టం.

ఈ నలుగురు భార్యలూ నాకు ఒకే భార్య అనుకునేవారు. కానీ విధివశాన వారికి తర్వాత ఒకరితో ఒకరికి పరిచయమై నాగుండు ఇలా షేప్ మారిపోయింది. చిరుగాలి తగిలినా గుండు మండుటవల్ల విగ్గుపెట్టుకోడం కూడా కష్టమైంది.

'అశ్రద్ధ యా హుతం దత్తం తపస్తప్తం కృతం చయత్!

అసది త్యుచ్యతే పార్థ! నచతత్ప్రే త్య నో ఇహ!!

శ్రద్ధ కలిగి శాస్త్రం చెప్పినట్లు ఆచరించు. నీవు కోరిన ఫలితం లభించు -" అన్నారోయ్ గీతాచార్యులు శ్రీకృష్ణభగవానుడు." అని విక్రమార్కుడు ముగించగానే రాజుకి మౌనభంగం కలిగి, బేతాళుడు ఎగిరిపోయి మళ్ళీ చెట్టెక్కేసాడు.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments